క్లుప్తంగా

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, ప్రజలు

జూలూరుపాడు: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం వినోభానగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రజలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ మాట్లాడుతూ.. గుడిసెలు, రేకుల ఇళ్లు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుండా భూములు, పట్టణాల్లో ఇళ్లు ఉన్న వాళ్లకు ఎలా ఇచ్చారని? ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా ఏ ప్రాతిపాదికన ఎంపిక చేశారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. అనర్హుల పేర్లను ఇందిరమ్మ ఇళ్ల జాబితా నుంచి తొలగించి, నిజమైన పేదలకు ఇవ్వాలని, రేషన్ కార్డులు లేని నిరుపేద కుటుంబాలకు మంజూరు చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేశ్, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, జర్పుల మల్లయ్య, నాగరాజు, అశోక్, ప్రజలు పాల్గొన్నారు.

నేడు బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

ఇల్లెందు: రాజీవ్ యువ వికాసం బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక కోసం ఎస్‌బీఐ శాఖ ద్వారా ఇంటర్వ్యూలు మంగళవారం జరుగనున్నాయి. పట్టణంలోని ఎంఆర్‌సీభవన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఇంటర్వ్యూల్లో 1 నుంచి 372 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 373 నుంచి 673 వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఇతర బ్యాంకుల నుంచి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 15న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో సకాలంలో హాజరుకావాలని కోరారు.

నిర్వాసితులకు న్యాయం చేయండి..

టేకులపల్లి: కోయగూడెం ఓసీ–2లోని పిట్–2, 3లో సాగు భూములు కోల్పోయిన గిరిజన నిర్వాసితులకు హైకోర్టు తీర్పు ప్రకారం భూమి నష్టపరిహారం చెల్లించి, న్యాయం చేయాలని భూ నిర్వాసితుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. 2007లో కోయగూడెం ఓసీ–2 పిట్–2, 3 కోసం గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములను ఎలాంటి నష్టపరిహారం, పునరావాసం ఇవ్వకుండా తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా వారికి న్యాయం చేయాలని కోరారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడితో భేటీ


హుస్సేన్‌నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

జూలూరుపాడు: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌ను మహబూబాబాద్ జిల్లా గుడూరులోని ఆయన నివాసంలో సోమవారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. హుస్సేన్‌నాయక్‌ను కలిసిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు భూక్యా రమేశ్, భూక్యా శ్రీనునాయక్, నిమ్మటూరి రామారావు, భూక్యా రవి, ధరావత్ నరేశ్, సురేశ్, రాందాస్ నాయక్, తదితరులు ఉన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు


ధాన్యం సేకరిస్తున్న కమిటీ ప్రతినిధులు

ఇల్లెందురూరల్: మండలంలోని పోచారంతండాలో ఈ నెల 18న ఆంజనేయస్వామి విగ్రహం, 19న నాభిశిల ప్రతిష్ఠాపన చేపట్టనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపనకు అవసరమైన సామగ్రిని ప్రతి ఇంటి నుంచి సేకరించే ప్రక్రియను సోమవారం ప్రారంభించారు. తొలి సహకారంగా ధాన్యాన్ని సేకరించారు.

సమస్యల వలయంలో..

- 'గూడెం' మున్సిపాలిటీలో వేధిస్తున్న సమస్యలు
- లైట్లు వెలగవు.. పంపులు సమయానికి రావు..
- డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తతో దుర్వాసన
- నీటి విడుదలకు సమయం నిర్దేశించాలని విన్నపం


డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ సమస్యల వలయంలో చిక్కుకుంది. పలు వార్డుల్లో పారిశుద్ధ్య సమస్యలు నెలకొన్నాయి. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో స్థానికంగా నివాసముండే ప్రజలు అవస్థ పడుతున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండడం లేదని వాపోతున్నారు. ఫలితంగా వీధుల్లో దుర్వాసన వెదజల్లుతుండడం, దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోవడంతో పలు అనారోగ్య సమస్యలకు దారితీస్తోందని చెబుతున్నారు. పట్టణంలో 36 వార్డులు ఉండగా నెహ్రూబస్తీ, చమన్ బస్తీ, మధురబస్తీల్లో ప్రజలు పారిశుద్ధ్య సమస్యతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లోని వీధుల్లో ఇళ్ల ముందు ఉన్న డ్రెయినేజీల్లో పారిశుద్ధ్య సిబ్బంది చెత్తా చెదరం తొలగించకపోవడంతో సిల్ట్ పేరుకుపోయింది. దీంతో సాయంత్రం వేళ ఇళ్ల ముందుకు వస్తే తీవ్ర దుర్వాసన వస్తుండడం వల్ల కొద్దిసేపు కూడా ఉండలేకపోతున్నామని పేర్కొంటున్నారు. దీంతో పాటు చెత్తాచెదారం వేసేందుకు ఆయా ప్రాంతాల్లో చెత్తకుండీలు లేవు. చాలామంది డ్రెయినేజీల్లో చెత్తపడేస్తున్నారు. ఉన్న ఒకటి, రెండు చెత్తకుండీలు రోడ్డుకు అడ్డుగా వస్తున్నాయని వార్డులోనే మూలనపడేశారు. మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టి ఏరియాల్లో ప్లాస్టిక్ డబ్బాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సమయపాలన లేదు..

కిన్నెరసాని పంపుల ద్వారా సమయమంటూ లేకుండా ఎప్పుడుపడితే అప్పుడు నీరు సరఫరా చేస్తున్నారు. వారంలో మూడు, నాలుగు రోజులకోసారి కిన్నెరసాని పంపులు వస్తాయి. ఒక నిర్ణీత సమయం అంటూ లేకపోవడంతో ప్రజలు పనులు మానుకుని పంపుల కోసం ఇళ్లలోనే ఉంటూ ఎదురుచూస్తున్నారు. ఒక సమయం కేటాయించి, అప్పుడే పంపుల ద్వారా నీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

వెలగని లైట్లు..

పట్టణ పరిధిలోని నెహ్రూబస్తీలో వీధిలైట్లు వెలగడం లేదు. చాలా కరెంటు స్తంభాలకు అసలు లైట్లే లేవు. వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి వేళ్లలో ఎవరు వస్తున్నారో తెలియడం లేదని, చోరీలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కాలనీవాసులు వాపోతున్నారు.

డ్రెయినేజీల్లో సిల్ట్ తొలగించాలి..



నెహ్రూబస్తీలోని డ్రెయినేజీల్లో సిల్ట్ పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వస్తోంది. మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా కూడా పట్టించుకోవడం లేదు. సిల్ట్ పేరుకుపోవడం వల్ల దోమలు, ఈగలు ఇళ్లలోకి వస్తున్నాయి. విషజ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి.

–షహనాజ్, చమన్‌బస్తీ

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి



బస్తీల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో పిల్లలు, పెద్దలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని విద్యుత్ స్తంభాలకు అసలు లైట్లే లేవు. ఉన్న లైట్లు వెలగవు. రాత్రి వేళల్లో ఎవరు వస్తున్నారో కూడా తెలియడం లేదు. ఇళ్లలో చోరీలు కూడా జరిగే అవకాశం ఎక్కువగా ఉంది.

–శ్రీధర్, నెహ్రూబస్తీ

నర్సింగ్ వృత్తి ఎంతో గొప్పది..


కేక్ కట్ చేస్తున్న నర్సులు, సిబ్బంది

టేకులపల్లి: సమాజంలో పవిత్రమైన, సేవతో కూడిన వృత్తి నర్సులదని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కంచర్ల వెంకటేశ్ అన్నారు. సోమవారం మదర్ ఆఫ్ నర్సింగ్, ద లేడీ విత్ ద లాంప్, ప్రపంచంలోని మొట్టమొదటి నర్స్ ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజుని పురస్కరించుకుని ప్రపంచనర్స్ డే వేడుక జరుపుకున్నారు. నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. ఓపిక, సహనంతో నిత్యం ఎంతోమంది రోగులు త్వరితగతిన కోలుకోవడానికి అందించే సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నర్సింగ్ ఆఫీసర్ జగదాంబ, సూపర్‌వైజర్లు గుజ్జా విజయ, పోరండ్ల శ్రీనివాస్, ధర్మపురి రవికుమార్, కిరణ్, కుమారి, రాజు, గంటా శ్రీనివాస్, నాగలక్ష్మి, కమల, రమాకుమారి, సుజాత, కళావతి, స్వప్న, లక్ష్మీబాయి, అరుణ్, కుమారి, స్రవంతి, వెంకటరమణ, అనసూర్య, మల్లు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుని జయంతి


బుద్ధుని జయంతిలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

సింగరేణి(కొత్తగూడెం)/కొత్తగూడెంఅర్బన్: వైశాఖ బుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం కారుకొండ రామవరంలోని బౌద్ధ ఆరామాల వద్ద బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ కమిటీ ఆధ్వర్యంలో పంచశీల ప్రబోధం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బౌద్ధ ఆరామం అభివృద్ధికి సింగరేణి యాజమాన్యం తరఫున సీఎండీ ఎన్.బలరామ్ రూ.20 లక్షలు మంజూరు చేశారని వెల్లడించారు. కార్యక్రమంలో జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) కవితానాయుడు, సొసైటీ అధ్యక్షురాలు కొచ్చెర్ల కమలారాణి, క్వాలిటీ జీఎం మేకల కనకయ్య, బత్తుల శ్రీనివాసరావు, డాక్టర్ ఇన్నయ్య, కె.అజయ్‌కుమార్, చంద్రమౌళి, తుంపురి శివ, వేల్పుల భాస్కర్, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలని ప్రచారం


ఇల్లెందురూరల్: పూబెల్లి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఈ నెల 18న ఇల్లెందులో నిర్వహిస్తున్న ఆదివాసీల బహిరంగసభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం బహిరంగ సభ ప్రచార వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాలకుల ఓటు బ్యాంకు రాజకీయాల మూలంగా ఎస్టీ జాబితాలోకి అక్రమంగా చేరిన లంబాడాలు ఉద్యోగ, ఉపాధి వనరులను ఆదివాసీలకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించి ఆదివాసీలకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. సభకు ఆదివాసీలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జారె కృష్ణ, పోలెబోయిన వెంకటేశ్వర్లు, మెట్ల పాపయ్య, జోగ రామబ్రహ్మం, బుగ్గ రామనాథం, ఈసం వీరస్వామి, కొర్స రాములు పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలనే ప్రధాన డిమాండ్‌తో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఇల్లెందులో నిర్వహించే ఆదివాసీ మహాగర్జన సభను జయప్రదం చేయాలని తుడుందెబ్బ జాతీయ కోకన్వీనర్ కల్తీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ముత్యాలంపాడు, తూర్పుగూడెం, తడికలపూడి, కుంటల్ల, కోటల్ల, అందుగులగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు.

సమ్మె వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు వెంటనే విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, కార్యదర్శి గెద్దాడి నగేశ్ తెలిపారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలంలో ఎఫ్‌సీఐ గోదాంలో హమాలీలను కలిసి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సామాజిక భద్రత, ప్రయోజనాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. అవసరమైతే బడ్జెట్‌లో నిధులు కేటాయించి హమాలీలకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు వెలిశాల రమణయ్య, అల్లి ముత్యం, పురస్నాటి సారయ్య, గాజుల వెంకటేశ్వర్లు, సైన్యము జగన్, తుసేటి కొమరయ్య, ఎచ్చే దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకులు రాల్చి.. పువ్వులు పూసి..



పాల్వంచరూరల్: గుల్‌మోహర్ (డెలోనిక్స్ రీజియా) అలియాస్ ఎర్రతురాయ్‌గా పిలుచుకునే ఈ చెట్టుకు ఎర్రని పూలు పూస్తాయి. ఆ పూలు పూచినప్పుడు ఆకులు లేకుండా ఉంటాయి. ఆ చెట్టుకు పూచే ఎర్రటి రంగు పూలను చూసినవారు వెంటనే ఆకర్షితులవుతారు. పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానివైపు వెళ్లే మార్గంలో రోడ్డు వెంట గుల్‌మోహర్ చెట్టు ఏడాది మొత్తం ఆకులతో నిండి ఉంటుంది. మండు వేసవిలో అది కూడా మే నెలలోనే ఆకులన్నీ రాలి ఎర్రటి పూలు పూస్తుంది. ప్రస్తుతం ఈ చెట్టుకు పూచిన పువ్వులను పర్యాటకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. కాగా, ఎక్కువగా ఈ చెట్లు మడగాస్కర్ ప్రాంతంలో కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

నారాయణ ఆశయ సాధనకు పోరాడాలి


మాట్లాడుతున్న ఆవునూరి మధు

ఇల్లెందురూరల్: న్యూడెమోక్రసీ సీనియర్ నేత కొండ నారాయణ ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు పోరాడాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. మండలంలోని రొంపేడు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొండా నారాయణ సంతాపసభ సోమవారం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేసిన నారాయణ పార్టీ నిర్మాణంలోనూ అంకితభావంతో పనిచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో రొంపేడు మాజీ సర్పంచ్ అజ్మీర శంకర్, నాయకులు కొక్కు సారంగపాణి, వెంకటేశ్వర్లు, తోడేటి నాగేశ్వరరావు, చిన్నస్వామి, సామెలు, ధర్మయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


సమావేశంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో అందరూ భాగస్వాములు కావాలని, కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తోందని, ఇది యావత్ కార్మిక వర్గానికి చాలా నష్టదాయకమని పేర్కొన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని, సంఘం పెట్టుకొని సమ్మె చేసే హక్కు లేకుండా చేస్తోందని, దీంతో మరింత శ్రమదోపిడీ పెరిగి కార్పొరేట్ సంస్థలకు మరిన్ని లాభాలు తెచ్చిపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు నూతన కోర్సులు

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మూడు నూతన కోర్సులు మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చిన్నప్పయ్య తెలిపారు. కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 2025–26 విద్యా సంవత్సరంలో కళాశాలకు బీఏ గ్రూపులో కంటెంట్ అండ్ క్రియేటివ్ గేటింగ్స్ (33812), బీకాం గ్రూపులో ఈ–కామర్స్ ఆపరేషన్స్ (34482), బీఎస్సీ గ్రూపులో హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ (34462) నూతన కోర్సులు మంజూరయ్యాయని చెప్పారు. ఇల్లెందు ప్రాంతంలోని విద్యార్థులు నూతన కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిగ్రీలో ప్రవేశాల కోసం నిర్దేశించిన దోస్త్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ మొదటి దశ మే 21వ తేదీ వరకు ఉంటుందని, కళాశాలలో విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ తీసుకోవడానికి ఉచిత రిజిస్ట్రేషన్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. పూర్తిస్థాయిలో అనుభవం, అంకితభావం కలిగిన అధ్యాపకులు, విద్యాబోధనకు తరగతి గదులు, ల్యాబ్ వంటి సౌకర్యాలు కలిగి ఉన్న ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు తొలి ప్రాధాన్యతనివ్వాలని కోరారు. దోస్త్ ఆన్‌లైన్ ప్రక్రియలో విద్యార్థులకు సహకరించేందుకు కళాశాలలో అధ్యాపకులు అందుబాటులో ఉంటారని ప్రిన్సిపాల్ వివరించారు.

నృత్య పోటీల్లో పాల్వంచవాసుల ప్రతిభ


బహుమతులు సాధించిన విద్యార్థినులు

పాల్వంచ: ఇటీవల తమిళనాడు రాష్ట్రం శ్రీపురం గోల్డెన్ టెంపుల్‌లో నిర్వహించిన నృత్య పోటీల్లో పాల్వంచ శ్రీసంతోషిని నాట్య నిలయం విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. ప్రహర్షిత, ప్రత్యూష, యోషిత, ధాత్రి, యశశ్విత, వర్షిణి, తన్మయ, లోకాక్షిత, కీర్తన, జశ్విత, మాన్విత, మీనాక్షి, చైత్రిక, డాన్స్ టీచర్ రమాదేవి, సమత ఐదు నృత్య ప్రదర్శనలు ఇచ్చి బహుమతులు అందుకున్నారు. సోమవారం విద్యార్థినులను డ్యాన్స్ టీచర్ రమాదేవి అభినందించారు.

అరుణాచలం మృతుడికి సంతాపం


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకుడు వెంకటరెడ్డి

జూలూరుపాడు: జూలూరుపాడుకు చెందిన తెలికిచర్ల రాకేశ్‌శర్మ తమిళనాడు రాష్ట్రం అరుణాచలం పుణ్యక్షేత్రంలో గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు జూలూరుపాడుకు సోమవారం తీసుకురాగా.. పలు పార్టీల నాయకులు, ప్రజలు సందర్శించి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు లేళ్ల వెంకటరెడ్డి, యల్లంకి చిన్ననాగేశ్వరరావు, చౌడం నరసింహారావు, దుద్దుకూరి మధుసూదన్‌రావు, యల్లంకి సత్యనారాయణ ఉన్నారు.

ప్రజలంతా ఎదురుచూపే..

- ఇల్లెందు పట్టణంలో తాగునీటి కటకట
- మూడు రోజులకోసారి సరఫరా
- రూ.కోట్లు వెచ్చించినా తీరని సమస్య


కోర్టు వద్ద కొనసాగుతున్న భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మాణం

ఇల్లెందు: ఇల్లెందులో మూడు రోజులకోసారి నీరు సరఫరా అవుతోంది. మిషన్ భగీరథ నీరందించేందుకు కోట్లు ఖర్చు చేసినా పట్టణం అంతా నీరు అందటం లేదు. పట్టణానికి చెరువు నీరు, 47 లెవల్ పైపులైన్ నీరు, సింగరేణి నీరు, భగీరథ నీరు అంతా కలిపి అందిస్తున్నారు. అయినా ఏప్రాంతానికి సరిపడా చేరడంలేదు. పైపులైన్లు, మోటార్లలో రిపేరు వస్తే రోజుల తరబడి నిలిచిపోతోంది. కొంతకాలంగా మూడు రోజులకు ఒకసారి 30 నిముషాల పాటే నీరు సరఫరా అవుతోంది.

ప్రత్యేక పథకం ఉన్నా..

ఇల్లెందుకు శుద్ధి చేసిన గోదావరి నీటిని అందించాలని ‘ఇల్లెందు పట్టణ బృహత్తర మంచినీటి సరఫరా పథకం’ ఏర్పాటు చేశారు. అయినా అందరి దాహార్తి తీరడం లేదు. 2020 డిసెంబర్ 11న రూ.31.06 కోట్లతో పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ మిషన్ భగీరథ (అర్బన్) పనులకు శ్రీకారం చుట్టారు. నేటికీ ఈ పథకం 100 శాతం పూర్తి కాలేదు. కోర్టు ఏరియాలో ఒక వాటర్ ట్యాంక్ నిర్మాణం సాగుతూనే ఉంది. సింగరేణి ద్వారా 12, 13, 14, 22, 23వ వార్డులకు, భగీరథ ద్వారా 9, 10, 14, 15, 22, 23వ వార్డులకు, చెరువు నీరు నంబర్–2 బస్తీకి సరఫరా అవుతోంది. ఫిల్టర్ బెడ్‌లోని వాటర్ ట్యాంకుల ద్వారా ఎల్‌బీఎస్‌నగర్, బస్టాండ్ ఏరియాకు, కోర్టు ఏరియాలోని ట్యాంకు ద్వారా గుండాల్‌రోడ్ వైపునకు సరఫరా అవుతోంది. పట్టణమంతటికీ నీరు సరఫరా కావాలంటే 6.2 గ్యాలన్ల నీరు అవసరమవుతోంది. కానీ, రోజు విడిచిరోజు సరఫరా చేయాల్సిన నీరు మూడు నాలుగు రోజులకోసారి సరఫరా చేస్తుండడంతో జనం ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

అసంపూర్తిగా నల్లాల ఏర్పాటు

మెయిన్ లైన్ నుంచి సబ్‌లైన్లు, సబ్ లైన్ల నుంచి ఇంటింటికీ నల్లాల కోసం పైపులు లాగి వదిలేశారు. నల్లా ఫిట్టింగ్ చేయాల్సి ఉంది. ఇల్లెందు పట్టణంలో సుమారు 5 వేలకు పైగా నల్లా కనెక్షన్‌లు ఉన్నాయి. వీటన్నింటినీ రెగ్యులర్ భగీరథకు అనుసంధానం చేయాల్సి ఉంది.

సమస్యల పరిష్కారంపై కార్యాచరణ



నీటి ఎద్దడి అరికట్టడంపై ప్రత్యేక సమావేశం నిర్వహించాం. సత్యనారాయణపురంలో 1, 2 వార్డులకు నీటి సరఫరా ఆగిపోయినప్పుడు 24 గంటల్లో సమస్య పరిష్కరించాం. మిగతా చోట్ల కూడా అలాగే పర్యవేక్షిస్తున్నాం. కోర్టు వద్ద ట్యాంకు నిర్మాణం త్వరలో పూర్తవుతుంది.

–సీహెచ్.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్

మరమ్మతులతోనే సమస్య

విద్యుత్ అంతరాయం, మోటార్లు కాలిపోవడం, పైపులైన్లు పగిలిపోవటం వల్ల నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఇటీవల ఎల్‌బీఎస్‌నగర్‌లో భగీరథ నీటి పైపు పగలడంతో సమస్య వచ్చింది. ఆ తర్వాత మోటార్ మరమ్మతుతో నీటి సరఫరాలో జాప్యం జరిగింది. ఇలా పలుమార్లు సమస్యలు తలెత్తడం.. దెబ్బతిన్న వాటికి మరమ్మతులు చేయడంతో ఇబ్బంది ఎదురైంది.

–మురళి, డీఈఈ, ఇల్లెందు మున్సిపాలిటీ